క్లుప్తంగా

రైతు పూజ్యనీయుడు

అంబాజీపేట: రోజూ ప్రజలందరికీ పట్టెడన్నం పెట్టే రైతు అందరికీ పూజ్యనీయుడని కోనసీమ ఆహార నిధి అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ అన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఇరుసుమండలో ఆహార నిధి, జేడీ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో రైతు పూజోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఏరువాకకు పూజలు నిర్వహించి దుక్కు దున్నారు. అనంతరం రైతులకు నూతన వస్త్రాలు ఇచ్చి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రంకిరెడ్డి కాశీ, విజయరావు, ఏడుకొండలు, మహేష్, వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి మాతకు పున్నమిహారతి

ఆలమూరు: మండలంలోని జొన్నాడలోని అఖండ గౌతమీ గోదావరి తీరంలో గౌతమీ గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి జరిగింది. శ్రీశుభకృత్ నామ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి ప్రముఖ వేద పండితుడు ద్విభాష్యం రవికృష్ణ శర్మ ఆధ్వర్యంలో మహిళ భక్త బంద సభ్యులు శాస్త్రోక్తంగా ఈపున్నమి హారతిని చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మహిళలు స్థానిక శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి గౌతమీ తీరానికి చేరుకుని గోదావరి మాతకు అఖండ పున్నమి హారతిని ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా ఏకాహం

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసిన కోదండరామ ఆలయంలో శనివారం ఏకాహం జరిగింది. ఆలయ 29వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈసందర్భంగా గ్రామానికి చెందిన మోటుపల్లి సత్తిబాబు, అమృత దంపతులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ఆలయ ఆవరణలో వేద పండితులు జి.బ్రహ్మన్న మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.. దేవతామూర్తులకు నూతన వస్త్రాలను అందజేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కపిలేశ్వరపురం మండలం టేకికి చెందిన గంగన్న భజన బృందం నిర్వహించిన పవళింపుసేవ, మేల్కొలుపు సేవ భక్తులను మంత్రముగ్ధులను చేసింది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఏకాహాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన జరిగింది.

బాల కార్మికను వ్యవస్థను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

ఆలమూరు: బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండపేట లేబర్ ఇన్‌స్పెక్టర్లు కె.శివ నాగమల్లేశ్వర రావు, అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ జి.కేశవరావు, అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం మండల విద్యాశాఖాధికారులు పి.షాలెంరాజు, పీవీ సుబ్బరాజుతో కలసి ఇటుక బట్టీలను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న వారి వివరాలను సేకరించారు. అలాగే కిరాణ, పాన్ షాపులు, గేదెలు, కోళ్ల ఫారాలను, వస్త్ర దుకాణాలను సందర్శించి బాలలతో పనిచేయించుకోవడం నేరమని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలని సంబంధిత యజమానులకు విజ్ఞప్తి చేశారు. శ్రమ ఆర్గనేజేషన్ ప్రతినిధి కె.నాగేశ్వరి, జానకి కళ్యాణి, సహచర అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.వరలక్ష్మి పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాద మృతులకు ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలి

పి.గన్నవరం: ఆర్‌పీ రోడ్డులో ఊడిమూడి వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతులకు ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయాలని ఊడిమూడి, జి.పెదపూడి గ్రామాలకు చెందిన మృతుల కుటుంబీకులు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అమలాపురంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద డీఆర్‌ఓ మొగలి వెంకటేశ్వరరావుకు వారు వినతిపత్రం సమర్పించారు. గత నెల 14న ఊడిమూడి వద్ద వ్యవసాయ కూలీలు ట్రాక్టర్‌పై ధాన్యం బస్తాలను లోడ్ చేసి, పగ్గాలు కడుతుండగా రావులపాలెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టిన విషయం విదితమే. ప్రమాదంలో ఊడిమూడి, జి.పెదపూడి గ్రామాలకు ఐదుగురు వ్యక్తులు మృతి చెందగా, కొన్ని రోజుల తర్వాత ఆర్టీసీ బస్సు కండెక్టర్ కూడా మరణించిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన రోజు రాత్రి రెండు గ్రామాల ప్రజలు, నాయకులు ఆందోళన చేపట్టడంతో కొత్తపేట ఆర్డీఓ వచ్చి, మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా అందిస్తామని ప్రకటించినట్టు వారు వివరించారు. ఎన్నికల కోడ్ కారణంగా ఈ సాయాన్ని ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. తీవ్ర ఇబ్బందులు పడుతున్న తమకు తక్షణమే సాయం అందించి ఆదుకోవాలని మృతుల కుటుంబాలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశాయి.

బాధిత కుటుంబ సభ్యులతో నేడు ముఖాముఖి

సఖినేటిపల్లి: కువైట్‌లో చిక్కుకుపోయిన బాధిత కుటుంబ సభ్యులతో ఆదివారం మోరి వీ కన్వెన్షన్ హాల్‌లో ఉభయ గోదావరి జిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, సీనియర్ అడ్వొకేట్ కుడిపూడి సూర్యనారాయణరావు ముఖాముఖి నిర్వహించనున్నారు. కువైట్ ప్రభుత్వం ఈ నెల 30వ లోపు ఎటువంటి కాగితాలు, ఆధారాలు లేకపోయినా ఆ దేశంలో చిక్కుకుపోయిన వారు దేశం విడిచి వెళ్లిపోవచ్చని క్షమాభిక్ష ప్రకటించిందన్నారు. దీంతో ఇందుకు సంబంధించిన బాధిత కుటుంబాలు స్వయంగా వీ కన్వెన్షన్ హాల్‌లో స్వయంగా పూర్తి వివరాలు అందజేయాలన్నారు. వివరాలు లిస్ట్ భారత విదేశాంగ మంత్రికి, కువైట్ రాజుకు ఎమ్మెల్సీ పంపిస్తారని, దీని నిమిత్తం మొబైల్ నంబర్ 9989839848 సంప్రదించవచ్చని ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాబీ గాబ్రియల్ తెలిపారు.

మలేరియా.. జర జాగ్రత్త



- ఆవగాహనతోనే వ్యాధి నివారణ
- దోమల బెడదను పూర్తిగా నిర్మూలించాలి
- విరివిగా మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు

ఆలమూరు: అసలే వర్షాకాలం.., సీజనల్ వ్యాధులు విజృంభించే పరిస్థితి... వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలి. వేసవి కాలం ముగిసి వర్షాకాలం ప్రవేశించే దశలో ప్రతి ఒక్కరూ కనీస జాగ్రత్తల పాటించి అంటువ్యాధులకు దూరంగా ఉండాలి. నేటి ఆధునిక సమాజంలో శాస్త్ర సాంకేతికత పరిజ్ఞానంతో కాలం ముందుకు సాగుతున్నా వ్యాధుల తీవ్రత మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. వర్షాకాలం దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో పాడి, తడిగా ఉన్న అపరిశుభ్రత వాతావరణ ప్రదేశంలో దోమలు సంచరించేందుకు అనుకూలంగా ఉంటుంది. అందులో భాగంగా మలేరియా వ్యాధి సంభవించే అవకాశం ఉంది. ఇటీవల కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా వ్యాధి తీవ్రత పెరుగుతుంది. దీంతో అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ క్షేత్ర స్థాయిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహిస్తుంది. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజవర్గాల పరిధిలోని 11 మండలాల్లో ఉన్న 23 పీహెచ్‌సీల్లో ఈనెల ఒకటి నుంచి 30 వరకూ జరిగే ఈ మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. అయా పీహెచ్‌సీల పరిధిలోని వైద్యారోగ్య సిబ్బంది ప్రతి రోజు వివిధ కూడళ్లను ఎంపిక చేసుకుని మలేరియా వ్యాధి వ్యాప్తి-నివారణ చర్యలను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. దోమల ద్వారా సంక్రమించే రక్తపు వ్యాధి మలేరియా అంటూ వైద్య నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. గత ఐదేళ్లలో అప్పటి ప్రభుత్వం జిల్లా వైద్యారోగ్య శాఖ ద్వారా ప్రతి శుక్రవారం ఫ్రైడే.. డ్రై డే పేరుతో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టి దోమల నివారణకు ప్రత్యేక కృషి చేసింది. వారంలో ఒక రోజు నివాస ప్రాంతాలను పొడిగా ఉంచడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన ఆ కార్యక్రమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.



చొప్పెల్లలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

దోమ కాటు ద్వారానే మలేరియా వ్యాప్తి

మలేరియా అనేది పరాన్నజీవి వల్ల సంభవించే వ్యాధి. దోమల కాటు ద్వారా వేగంగా మలేరియా వ్యాప్తి చెందుతుంది. అనాఫిలిస్ అనే ఆడదోమ మనిషిని కాటు వేసినప్పుడు ప్లాస్మోడియం అనే సూక్ష్మజీవి శరీరంలోకి చేరడం ద్వారా మలేరియా వ్యాధి సోకుతుంది. మలేరియా రోగిని దోమ కాటు వేసినప్పుడు దోమ జీర్ణాశయంలోకి చేరిన ప్లాస్మోడియం సూక్ష్మజీవి పక్షం రోజుల పాటు అక్కడే ఉంటూ వృద్ధి చెందడం ద్వారా మలేరియా వ్యాధి విజృంభిస్తుంది.



అనాఫిలిస్ దోమ

దోమ కాటుకు గురైన 10 నుంచి 15 రోజులు లోపు చలి, జ్వరం, వణుకు, వాంతులుతో కూడిన చలి జ్వరం వస్తుంది. రెండు రోజులకోసారి జ్వరం రావడం, రాత్రి సమయంలో ఎక్కువగా ఉండటం కనిపిస్తుంది. సాధారణ జ్వరంగా భావించి మందులు వేసుకున్నా మూడు గంటల వ్యవధిలో మళ్లీ జ్వరం వస్తుంది. రోజులు గడిచే కొలదీ చలితో జ్వరం, వణుకుతో జ్వరం, తీవ్ర జ్వరం వచ్చి చమటలు పట్టి తగ్గిపోవడం అనే మూడు దశలు రోజూ కనిపిస్తాయి. ప్రాథమిక దశలోనే చికిత్స ప్రారంభిస్తేనే మంచి ఫలితం ఉంటుంది. వ్యాధి తీవ్రత పెరిగితే మెదడు, మూత్ర పిండాలు, కాలేయం దెబ్బతింటాయి. మలేరియా నాలుగు రకాలు కాగా అందులో ప్లాస్మోడియం ఫాల్సిఫారం (పీఎఫ్) మలేరియా అత్యంత ప్రమాదకరం. చికిత్స ఆలస్యమైతే రోగి చనిపోయే పరిస్థితులుంటాయి.

అవగాహనతోనే నివారణ

వ్యాధుల బారినపడి అవస్థలు తెచ్చుకునే కంటే దోమల నివారణ మార్గాలను అనుసరించడం మేలని పలువురు వైద్యులు చెబుతున్నారు. దోమలు సాధారణంగా లార్వా, ప్యూపా అనే రెండు దశల్లో వృద్ధి చెందుతాయి. తొలి దశ నుంచి దోమగా పరిణామం చెందేందుకు వారం నుంచి పది రోజులు పడుతుంది. లార్వా దశలోనే వీటి వృద్ధిని నిలువరిస్తే వాటి ప్రభావాన్ని దాదాపు తగ్గించవచ్చు. దోమలు కుట్టకుండా ఉండేందుకు దోమ తెరలను వినియోగించాలి. పరిసరాల్లో నీటి గుంతలు, బురద, పేడ లేకుండా చూసుకోవాలి. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలి. పశువుల పాకల వద్ద గంజి, దాణాలను వేసే గిన్నెల్లో నీరు చేరకుండా చూసుకోవాలి.

సమన్వయంతో డయేరియా ప్రబలకుండా చూద్దాం

అంబాజీపేట: అధికారులంతా కలిసి సమన్వయంతో పనిచేసి డయేరియా ప్రబలకుండా చూద్దామని అందుకు అందరూ సహకరించాలని అమలాపురం డీఎల్పీవో పి.బొజ్జిరాజు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జీవీ సరోవర్ అధ్యక్షతన డయేరియా ప్రబలకుండా తీసుకునే జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. డీఎల్పీవో బొజ్జిరాజు, ఎంపీడీవో సరోవర్ మాట్లాడుతూ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు మండలంలో డయేరియా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు, వాడకపు నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాటర్ ట్యాంకులు శుభ్ర పరుచుట, పైపులైన్‌లు ధ్వంసమైన చోట పునరుద్ధరించడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం వంటి వాటిపై దృష్టి పెడుతున్నామన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేకశ్రద్ధ పెట్టామన్నారు. డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు మండలంలో ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు టీమ్‌గా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీరి పర్యవేక్షణలో గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులు, మంచినీరు తదితర అంశాలను పరిశీలించనున్నామన్నారు. అలాగే వైద్య సిబ్బందిచే ఇంటింటా సర్వే చేయించనున్నామన్నారు. గ్రామాల్లో అధికారులందరితో కలిసి అవగాహన సదస్సును నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.మమత, వైద్యాధికారులు బీఎస్ శ్రీనివాస్, ఎ.ఇంద్రావతి, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

సేవలే వాసవీ క్లబ్ లక్ష్యం



ముక్కామలలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు



పి.గన్నవరంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసిన వాసవీ క్లబ్ నాయకులు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సామాజిక సేవలు అందించడమే వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ లక్ష్యమని ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మల్టిపుల్) సుగ్గుల ప్రసన్నరావు అన్నారు. ముక్కామల వాసవీ, వనిత క్లబ్ వారి సహకారంతో ముక్కామల, ఇరుసుమండ, మొసలపల్లి, గంగలకుర్రు అగ్రహారం, ఇందుపల్లి గ్రామాల్లో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ ఐదు గ్రామాల్లో ఐదుగురికి స్టిక్స్ (దివ్యాంగులకు చేతికర్ర), వీధి వ్యాపారులకు గొడుగులు, ఇరవై మంది పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, పోలీసుల సేవలను గుర్తించి 5 మాస్కులు, టవల్, ఫ్లోరోసెంట్ జాకెట్, 10 మంది నూతన సభ్యులను చేర్చడం, నేత్ర అవయవ దానాన్ని ప్రోత్సహించి సంబంధిత వాగ్దాన పత్రాన్ని పూర్తి చేయించడం, దాతలకు సత్కారం, వాసవీ మాత దేవాలయంలో అవసరమైన సేవ, నాలుగు చక్రాల తోపుడు బండిని ఏర్పాటు చేయడం తదితర సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముక్కామలలో గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే గ్రామదేవత అంకాలమ్మ అమ్మవారికి బంగారు సూత్రాలు, వెండి పాత్రలను సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక అధ్యక్ష, కార్యదర్శులు బచ్చు సత్యనారాయణమూర్తి, కేదారశెట్టి సత్యనారాయణ, ట్రెజరర్ అప్పన శ్రీరామచంద్రమూర్తి, ఐపీసీ నూలు వరలక్ష్మి, ఆర్సీ చుండూరి సుధీర్, ఆర్ఎస్ చక్కా ప్రవీణ్, జెడ్‌సి గొళ్ల బాలాదేవి, డీపీసీలు తమ్మన శ్రీనివాస్, బచ్చు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పి.గన్నవరం: ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పి.గన్నవరం గ్రామంలో 100 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వాసవి క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్టు క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ నారాయణ సురేష్ తెలిపారు. స్థానిక సాయితేజ స్కూలులో పి.గన్నవరం వాసవి క్లబ్ కార్యదర్శి పాబోలు కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నారాయణ సురేష్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రామకృష్ణ గంగాధర్, ఆర్‌సీ కుమార్, జెడ్‌సీ కొత్త పద్మావతి, పి.గన్నవరం క్లబ్ కోశాధికారి పాబోలు పల్లంరాజు, గోకవరపు వల్లీ, స్కూలు కరస్పాండెంట్ అన్నాబత్తుల అనుబాబు, ప్రిన్సిపల్ సుంకర వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురంలో 'నేను బడికి పోతా'



మలికిపురంలో నేను బడికి పోతా ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అధికారులు

మలికిపురం: బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్చడమే 'నేను బడికి పోతా' ర్యాలీ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంఈవో యం.విజయశ్రీ తెలిపారు. మలికిపురం మండలం విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం నేను బడికి పోతా ర్యాలీ విజయవంతంగా జరిగింది. ఎంఈవో-1 ఎం.విజయశ్రీ ఆధ్వర్యంలో జరిగిన 'నేను బడికి పోతా' ర్యాలీ కార్యక్రమానికి ఎంపీడీవో బి.మంగాదేవి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్చే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. గుర్తించిన పిల్లలను గ్రామ వలంటీర్ల సహాయంతో బడిలో చేర్పిస్తామన్నారు. బడిలో చేరిన బడిఈడు పిల్లలకు స్టూడెంట్ కిట్, ఇతర విద్యా ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎపంచాయతి సెక్రటరీలు, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సీఆర్ఎంటీలు, పీటీఐలు విద్యాశాఖ సిబ్బంది ఆర్.శేఖర్, ఆర్.రవి పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: బడి బయట పిల్లలను గుర్తించి వారిని అందరినీ బడిలో చేర్పించాలని తహసీల్దార్ ఎం.మేరికమ్మ సూచించారు. నేను బడికి పోతా కార్యక్రమంపై మామిడికుదురు ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్లుకు సమీక్ష నిర్వహించారు. ఎంఈఓలు ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు మాట్లాడుతూ మండలంలోని 60 ఆవాస ప్రాంతాల్లో బడి బయట పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం ఈ నెల 15 నుంచి ప్రారంభించామన్నారు. వచ్చే నెల 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని తహసీల్దార్ మేరికమ్మ సూచించారు. సమావేశంలో ఏఓ కె.వెంకటేశ్వరరావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్స్ కె.ప్రవీణ్‌కుమార్, పీవీఎస్ నాగవేణి, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, సీఆర్ఎంఈలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా
జ్యూట్ బ్యాగుల ఉత్పత్తి



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు ఏజీఎం సోమునాయుడు

మలికిపురం: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా జ్యూట్ బ్యాగుల తయారీని నాబార్డు ప్రోత్సహిస్తుందని నాబార్డు ఏజీఎం వై.సోము నాయుడు పేర్కొన్నారు. నాబార్డు వారి సహకారంతో ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవనోపాధి ఆధారిత శిక్షణ కార్యక్రమం భాగంగా జ్యూట్ బ్యాగుల ఉత్పత్తుల శిక్షణను మూడు గ్రామాలకు కలిపి మండలంలోని కేశనపల్లి గ్రామాల్లో శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాబార్డు ఏజీఎం వై.సోము నాయుడు ప్రారంభించి మాట్లాడుతూ పర్యావరణ అనుకూలమైన జ్యూట్ ఉత్పత్తి తయారీ చాలా అవసరం అని, 90 మహిళలకు 20 రోజుల పాటు కేశనపల్లి, పడమటిపాలెం, గూడపల్లి గ్రామాల మహిళలకు శిక్షణ జరుగుతుందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు ఉపయోగించుకోవాలన్నారు. బాగా శిక్షణ తీసుకుని ఆర్థికంగా పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలని దిశా నిర్దేశం చేశారు. మరో ముఖ్య అతిథిగా జిల్లా డీఆర్‌డీఎ పీడీ శివశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి నూతనంగా యూనిట్లు పెట్టుకోవడానికి ప్రభుత్వం నుంచి అన్ని సహకారాలు అందిస్తామని తెలియజేశారు. జ్యూట్ బ్యాగుల ఉత్పత్తి స్థానిక ట్రైనర్ తోట ఉమ మహేశ్వరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జ్యూట్ బ్యాగ్స్ ట్రైనింగ్ పెట్టడం మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు మోక్షం



శ్మశానవాటికలో తుప్పలు తొలగిస్తున్న ఉపాధి కూలీలు

మామిడికుదురు: తుప్పలతో పూర్తిగా మూసుకుపోయి అడవిని తలపిస్తున్న అప్పనపల్లి శ్మశాన వాటికను గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు శుభ్రం చేశారు. శ్మశాన వాటికలో విపరీతంగా పెరిగిపోయిన తుప్పలు, డొంకల్ని సమూలంగా తొలగించారు. శ్మశాన వాటికలో డొంకలు విపరీతంగా పెరిగిపోయి ఎవరైనా చనిపోయిన సందర్భాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ గ్రామస్తులు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు. శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు ఒక్కో రోజు 36 మంది కూలీలు వంతున శ్మశాన వాటికలో పని చేశారు. తద్వారా శ్మశాన వాటికను తీర్చిదిద్దారు. దీనిపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసియున్న శ్రీశ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాలు శనివారం భక్తులతో క్రిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కొర్లపాటివారిపాలెంలో...

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. తొలుత స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున పలు పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.



నల్లచెరువులో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలోని కొడవటివారిలంకకు చెందిన ఓ యువకుడు అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్సై వి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడిలోని కొడవటివారిలంకకు చెందిన వంత్రపాటి వీరవెంకటసత్యనారాయణ (25) ఈ నెల 20న తనకు పెళ్లికావడం లేదని మనస్తాపంతో పురుగుమందు తాగాడు. అతడిని బంధువుల చికిత్స కోసం అమలాపురంలోని ఓ ప్రైవేటు అస్పత్రికి తరలించారు. అక్కడ వీరవెంకట సత్యనారాయణ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై మృతుడి సోదరుడు వీరన్న ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాబ్ మేళాలో 54 మందికి ఉద్యోగాలు



కొత్తపేట జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు తదితరులు

కొత్తపేట: విద్యార్థి దశ నుంచి ఉద్యోగ జీవితంలో అడుగుపెడుతున్న మీరు ఆయా కంపెనీల్లో ఉత్తమ ఉద్యోగులుగా యాజమాన్యాల మన్ననలు పొంది ఉన్నత స్థాయికి చేరుకోవాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు సూచించారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ), వికాస సంయుక్త ఆధ్వర్యంలో 300 పైగా ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 283 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోగా 213 మంది హాజరయ్యారు. వారిలో 54 మంది ఎంపిక కాగా వారిని ప్రిన్సిపాల్ అభినందిస్తూ జాబ్ ఆఫర్ లెటర్స్ అందజేశారు. మరో 59 మంది విద్యార్థులు సెకండ్ రౌండ్ ఇంటర్వ్యూకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసులు, మెంబర్ డి.కావ్య, అధ్యాపకులు అంకమరావు, పాపారావు, వికాస ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం గ్రామాలకు ఆదివారం ఆరు గంటలు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు శనివారం అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఈ సమయంలో విద్యుత్ లైన్ వద్ద చెట్ల కొమ్మలు, ఆకుల తొలగింపు పనులు చేపడతామన్నారు. అలాగే మరమ్మతులు చేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గోశాలకు ఎండు గడ్డి వితరణ



అంతర్వేది గోశాలకు ఎండుగడ్డి వితరణ చేసిన వారితో ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలోని గోశాలకు పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం పి.వేమవరానికి చెందిన నామన నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు కలిసి రూ.25 వేలు విలువైన రెండు ట్రాక్టర్లు ఎండుగడ్డిని శనివారం వితరణ చేశారు. ఈ మేరకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సమక్షంలో గోశాల సిబ్బందికి ట్రాక్టర్లు గడ్డిని అందజేశారు. కాగా ఆలయంలో వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి లడ్డు ప్రసాదాలను దేవస్థానం సిబ్బంది అందజేసింది.

వైభవంగా దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణం



బి.సావరంలో నిర్వహించిన కల్యాణం

కొత్తపేట: స్థానిక బొరుసువారి సావరంలో వేంచేసిన విజయ కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం, దుర్గామల్లేశ్వరస్వామి దివ్యతిరు కల్యాణ మహోత్సవం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 20 నుంచి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలు ప్రారంభం కాగా శుక్రవారం రాత్రి కళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సుమారు 30 మంది దంపతులు కన్యాదాతలుగా నిలిచి కల్యాణం జరిపించారు. ప్రదానం నుంచి తలంబ్రాల వరకూ ప్రతీ కార్యక్రమాన్ని పండితులు ఆ దంపతులతో చేయించారు. బ్రహ్మశ్రీ అనంత లక్ష్మణకుమారాచార్యులు కల్యాణ వ్యాఖ్యానం విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా కన్యాదాన ఫలితాన్ని వివరించారు. ఆడపిల్ల వివాహ సమయంలో కన్యాదానం చేయడం అనేది పూర్వజన్మ పుణ్య ఫలమని, ఇది ఎంతో మంచి ఫలితాలను ఇస్తుందని వివరించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులు స్వామి, అమ్మవారికి మ్మవారికి పట్టు మధుపర్కాలు, కల్యాణ మాలలు సమర్పించారు. కొత్తపేట పరిసర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.